సాక్షి సిద్దిపేట

సోమవారం । 3 । జూలై । 2023



పట్టించుకునేవారే లేరా?

బొతులబోగుడ నుంచి రాయిపల్లి వరకు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఏడుసార్లు టెండర్లు పిలిచినా ఏ ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. 8లో..



ఒక గది.. 45 మంది విద్యార్థులు

అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లబండ గ్రామ ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులకు ఒకే గది ఉండడంతో ఉపాధ్యాయులు చెట్లకింద, వరండాలో పాఠాలు బోధిస్తున్నారు. 9లో..

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.

న్యూస్‌రీల్

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



ఇంటింటి ప్రచారంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ప్రజాధనాన్ని దోచుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడుతారని బీజేపీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మగ్దుంపూర్‌లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే నిధులతో రాష్ట్రంలో పథకాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కుమారస్వామి, స్వల్పకాలిక ప్రచారకులు రమేష్, కన్నన్, హరీష్, నాయకులు యాదమల్లు, రవి, కొమురయ్య, రాజ య్య, సతీష్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కి రుణపడి ఉంటాం



ఆలేటి రమేష్

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్‌కు రజకులు జీవితాంతం రుణపడి ఉంటారని రజక విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలేటి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే పనిని రజకులకు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని, దీనిని స్వాగతిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రజక ఫెడరేషన్ సమన్వయంతో 12 చోట్ల పైలెట్ ప్రాజెక్ట్ కింద ఆధునిక దోబీఘాట్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అలాగే మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు 141 మున్సిపల్ పట్టణ కేంద్రాల్లో 100 శాతం సబ్సిడీతో ఒక్కొక్కటి రూ.2 కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. లాండ్రీ షాపులు, దోబీ ఘాట్లకు నెలకు 250యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించి రజక కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు పరిసరాల్లో పచ్చదనం



పనులు చేస్తున్న కూలీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు పరిసరాలు త్వరలో పచ్చదనంతో ఆహ్లాదం పంచనున్నాయి. ఆదివారం రేగొండ పంప్‌హౌజ్ డెలివరీ సిస్టం కుడి కాలువ నుంచి కట్టపైకి పచ్చగడ్డి పేర్చే పనులు చేపట్టారు. ఇందుకోసం 30 మంది మహిళలు పని చేశారు. నాటిన గడ్డి పదిహేను రోజుల్లో పచ్చదనం అలుముకుంటుందని అధికారులు చెప్పారు. ఈ గడ్డి కట్ట కోతకు గురికాకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. ఒక పక్క ప్రాజెక్టులో గోదావరి జలాలు.. మరోపక్క కట్టపై గ్రీనరీ త్వరలో సందర్శకులను ఆకట్టుకుంటాయని చెప్పారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవలో భక్తులు

పాపన్నపేట(మెదక్): గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం ఏడుపాయల దుర్గా భవానీ అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. అర్చకులు, ఈఓ సార శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచి ఆలయం నుంచి గోకుల్ షెడ్డు వరకు ఊరేగించారు.

పత్తి తగ్గెన్

- రెండో స్థానానికి తెల్ల'బంగారం'
- అగ్రభాగానికి వరి సాగు
- 1.30లక్షల ఎకరాల్లో పత్తి అంచనా
- వర్షాల లేటుతో సాగు ఆలస్యం

గజ్వేల్: జిల్లాలో సాగు స్వరూపం మారుతోంది. గతంలో సింహభాగాన్ని ఆక్రమించే పత్తి గత కొన్నేళ్లుగా రెండోస్థానంలోకి పడిపోతున్నది. జిల్లాలో భారీ రిజర్వాయర్ల నిర్మాణం వల్ల భూగర్భజలం గణనీయంగా పెరగటం, కాల్వల ద్వారా నీరందే అవకాశం లభించడంతో వరి సాగు క్రమంగా పెరిగి నేడు అగ్రభాగాన్ని ఆక్రమించింది. వరి ఈసారి 4లక్షల ఎకరాల్లో సాగులోకి రానుండగా, పత్తి 1.30లక్షల ఎకరాల్లోపే ఉండొచ్చని వ్యవసాయశాఖ భావిస్తున్నది. వర్షాల లేటు వల్ల ఈసారి పంటల సాగు సైతం ఆలస్యంగా ప్రారంభమైంది.

- సిద్దిపేట జిల్లా రైతులకు ఏళ్ల తరబడి రైతులకు పత్తి సాగుతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. కాలం కలిసోస్తే స్వల్పకాలంలో రైతులను స్థితిమంతులను చేయడమో, లేదా భారీ నష్టాలు చూపి కుంగదీయడమో ఈ పంట ప్రత్యేకత. కొన్నేళ్ల క్రితం వరకు ఈ పంటకు రైతులు మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం పత్తి సాగు రెండోస్థానంలోకి పడిపోయింది. వరి సాగు గణనీయంగా పెరగటమే ఇందుకు కారణం.
- జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి 5.78లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ క్రమంలోనే వరి సాగును 4లక్షల ఎకరాల్లో, 1.30లక్షల ఎకరాల్లో పత్తి సాగును అంచనా వేస్తుండగా.. 36వేల ఎకరాల్లో మొక్కజొన్న, కంది 12,500ఎకరాల సాగును అంచనా వేస్తుండగా... మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు సాగులోకి రానున్నాయి.
- ఈసారి వర్షాలు సమయానికి పడకపోవడం వల్ల వానాకాలం సాగు ఆలస్యంగా సాగుతోంది. నిజానికి ఇప్పటికే వ్యసాయశాఖ అంచనా సాగులో సగం వరకు విత్తనాలు వేయాల్సి ఉండేది. కానీ పరిస్థితి దానికి భిన్నంగా ఉన్నది. ఇప్పటివరకు పత్తి సాగు ఇప్పుడిప్పుడే ప్రారంభం కాగా, మిగితా పంటల సాగు మందకొడిగా సాగుతున్నది.
- జూన్ 30 నాటికి పత్తి సాగు జిల్లావ్యాప్తంగా 5,892 ఎకరాల్లో సాగులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ చెబుతోంది. వరి సాగు ఇప్పటివరకు కేవలం 133 ఎకరాలు సాగులోకి రాగా, 2.90లక్షల ఎకరాల సాగుకు సరిపడా 14,520 ఎకరాల్లో నారుమళ్లు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ చెబుతోంది. మొక్కజొన్న 753ఎకరాలు, కంది 17ఎకరాలు, వేరుశనగ 80ఎకరాల్లో సాగులోకి వచ్చాయి.
- సాధారణంగా జిల్లాలో వరి ఆగస్టు నెల వరకు నాట్లు వేస్తారు. కానీ పత్తిని జూలై రెండో వారంలోపే విత్తుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఇప్పటికే సాగు కనీసం 50వేల ఎకరాల దాటాల్సి ఉండగా.. మందకొడిగా సాగి 5,892 ఎకరాలకే పరిమితమైంది. దీనిని బట్టి వ్యవసాయశాఖ అంచనాను చేరుకోవడం కూడా కష్టసాధ్యంగా కనిపిస్తున్నది.



గజ్వేల్ మండలం రిమ్మనగూడలో పత్తి సాగు

అధిక సాంద్రత పద్ధతిపై కొరవడిన ప్రచారం

పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతికి ఈసారి ప్రచారం కరువైనట్టే కనిపిస్తుంది. సంప్రదాయ పద్ధతిలో అయితే ఎకరాకు రెండు విత్తన ప్యాకెట్లను (ఒక్కో ప్యాకెట్ పరిమాణం 450 గ్రాములు) విత్తుతారు. దీని ద్వారా ఎకరాకు కేవలం 7 వేల నుంచి 8వేల మొక్కలే వస్తాయి. కానీ అధిక సాంద్రత విధానంలో ఎకరాకు 5 ప్యాకెట్ల విత్తనాలు విత్తుతారు. దీని ద్వారా ఎకరాకు 25 వేల మొక్కలు వస్తాయి. మొక్కల మధ్య దూరాన్ని తగ్గించి విత్తడం వల్ల సంఖ్య గణనీయంగా పెరిగి..అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. ఈ పద్ధతిని వ్యవసాయశాఖ గతేడాది క్షేత్రస్థాయిలో ప్రోత్సహించినా...ఈసారి మాత్రం అనుకున్నస్థాయిలో ప్రచారం కల్పించలేపోతుంది. ప్రచారం చేసి ఉంటే సాగు పెరిగే అవకాశముండేది. కానీ జిల్లాలో పరిస్థితి భిన్నంగా మారింది.

జిల్లాలో సాగు ఊపందుకున్నది



జిల్లాలో సాగు ఊపందుకుంది. సహజంగానే వరి మొదటి స్థానంలో నిలవనుండగా... పత్తి రెండోస్థానానికి రానున్నది. అంచనా మేరకు పత్తి 1.30లక్షల ఎకరాల్లో సాగులోకి వస్తుందో లేదో చూడాలి. అధిక సాంద్రత సాగును ప్రోత్సహిస్తాం. ఈ సీజన్‌లో ప్రత్యేకంగా 20వేల ఎకరాల్లో పత్తి అధిక సాంద్రత విధానంలో సాగులోకి వస్తుందనే ఆశాభావంతో ఉన్నాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

నేడు జిల్లా స్థాయి టోర్నమెంట్ వర్క్‌షాప్

సిద్దిపేట కమాన్: జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట విపంచి కళా నిలయంలో జిల్లా స్థాయి టోర్నమెంట్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నృత్య ప్రదర్శనకు తాజాగా ఒలింపిక్స్‌లో కూడా క్రీడాంశంగా చేర్చారని తెలిపారు. నృత్య కళాకారులకు ఇది సువర్ణ అవకాశం అన్నారు. తమ సంస్థ ద్వారా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయిలో నృత్య ప్రదర్శనకు సంబంధించిన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ప్రోత్సహిస్తామన్నారు. జూలై 3వ తేదీన సిద్దిపేట విపంచి కళా నిలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేత, ప్రజాప్రతినిధులు, సంపూర్ణేష్‌బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, విశాల్, అజయ్, లక్ష్మణ్, కిరణ్, ప్రశాంత్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొమురవెల్లిలో భక్తుల కోలాహలం



ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల రద్దీ

మల్లన్న నామస్మరణతో మారుమోగిన ఆలయ పరిసరాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తుల రాకతో సందడిగా మారాయి. దీంతో ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మార్మోగాయి. స్వామివారిని సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. తెల్లవారుజాము నుంచి పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు అభిషేకాలు, పటాలు, ఒడిబియ్యం, అర్చనలు, కేశఖండన, గంగరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా కొండ పైన రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. స్వామివారి దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఏర్పాట్లను ఏఈవోలు అంజయ్య, శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

- హైదరాబాద్‌కు చెందిన బొద్దుల రమణ్ దేవిక దంపతులు స్వామివారి నిత్య అన్నదానానికి లక్ష నూట పదహారు రూపాయలు, సుమారు రూ. 2లక్షల 75వేల విలువ గల వెండి ప్లేట్లు, గిన్నెలు, ఏక హారతి, పంచపాలిలను విరాళంగా అందించారు.
- కొమురవెల్లి మల్లికార్జున స్వామిని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు దంపతులు

ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న రఘువర్ధన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మొదటి వేతన సవరణ సంఘం గడువు ముగిసినందున, ప్రభుత్వం వెంటనే రెండవ వేతన సవరణ సంఘం వేసి ఐఆర్ ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం కాలయాపన లేకుండా కమిటీ వేసి వేతన సవరణ చేయాలన్నారు. మొదటి పీఆర్‌సీ సమయంలో కమిటీ వేసినప్పటికీ దాని నివేదిక వచ్చి వేతన సవరణ చేయడానికి తీవ్ర జాప్యం జరిగిందన్నారు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అదేవిధంగా పదోన్నతులు, బదిలీల అంశంలో చొరవ తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులైనా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షులు మొలంకల శ్రీనివాస్, గడీల శ్రీకాంత్, జిల్లా కార్యదర్శులు కత్తుల రాంరెడ్డి, స్వామి గౌడ్, డివిజన్ కన్వీనర్ వీరేశం, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌజింగ్‌బోర్డు కాలనీ, నాయకం నగర్, నందనవనం, ప్రగతి నగర్, మెరీడియన్ స్కూల్ ఏరియా, టీచర్స్ కాలనీ, ఏన్సాన్‌పల్లి రోడ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని చెప్పారు.

వైభవంగా మహంకాళి బోనాలు



బోనమెత్తిన జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

గజ్వేల్‌రూరల్: ఆషాఢ మాసంలో నిర్వహించే మహంకాళి అమ్మవారి బోనాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహంకాళి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు పూజారి చాడ నందబాలశర్మ పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అలాగే భక్తులు అమ్మవారికి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మాజీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కిటకిటలాడిన మెదక్ చర్చి



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సాగిన మొదటి ఆరాధనలో చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులను ఆశీర్వదించారు. కాగా దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అరచేతిలో గోరింటాకు అందాలు



గోరింటాకు రుబ్బుతున్న మహిళలు

హుస్నాబాద్: ఆషాఢ మాసం వచ్చిందంటే ముందుగా గుర్తుకు వచ్చేది గోరింటాకు. ఈ మాసంలో ప్రతి ఇంటిలో మహిళలు, యువతులు గోరింటాకు చేతులకు పెట్టుకొని మురిసిపోతారు. హుస్నాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో ఆదివారం ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు సంబరాలు నిర్వహించారు. మహిళలంతా ఒకచోట చేరి గోరింటాకును రోళ్లలో రుబ్బి చేతులకు అందంగా అలంకరించుకున్నారు.



చేతులకు గోరింటాకు పెట్టుకున్న మహిళలు

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- పోతారం(జే)లో జోరుగా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటుతుంటే.. మరోవైపు అక్రమార్కులు చెట్లను నరుకుతూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది. అటవీని రక్షించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం వాల్టా చట్టం రూపొందించింది. చెట్లను నరకాలంటే అటవీ, రెవెన్యూ శాఖల సంబంధిత గ్రామ పంచాయితీ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో జోరుగా చెట్లను నరికివేస్తున్నారు. గ్రామం నుంచి హైదరాబాద్‌కు కలపను అక్రమంగా తరలిస్తున్నారు. ఆదివారం సెలవు దినం వచ్చిందంటే చాలు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను నేలమట్టం చేస్తున్నారు. ఓ కలప వ్యాపారి ఆదివారం సాయంత్రం పోతారం(జే) గ్రామ నడిబొడ్డున డీసీఎం వ్యాన్‌లో కలను లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలించారు. పలుమార్లు అటవీశాఖ అధికారులను 'సాక్షి' సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



పోతారం(జే) గ్రామంలో కలపను లోడు చేస్తున్న కూలీలు

క్లుప్తంగా

కారు దగ్ధం



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జాతీయ రహదారి 65పై వెళ్తున్న కారులో ఆకస్మికంగా మంటలు చెలరేగి దగ్ధమైంది. సదాశివపేట నుంచి నర్సాపూర్ వైపునకు వెళ్తున్న కారు పెద్దాపూర్ శివారులో ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ మంటలు గమనించి రోడ్డు పక్కకు కారు ఆపాడు. వెంటనే అందులో ఉన్న ఏడుగురు కిందకు దిగారు. ఈ ఘటనలో అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేసింది. ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది.

ప్రమాదవశాత్తు గుడిసె..



ప్రమాద స్థలం వద్ద బాధితులు

చేగుంట(తూప్రాన్): ప్రమాదశాత్తు గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని చందాయిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిట్టల కృష్ణకు చెందిన గుడిసె ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో గృహోపకరణలు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం సాయం అందించాలని కోరాడు.

చికిత్స పొందుతున్న ఏఎన్ఎం మృతి



అమృత (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనారోగ్యంతో పీర్లపల్లి సబ్ సెంటర్ సెకండ్ ఏఎన్ఎం అమృత (42) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించింది. ఆమె 2008 నుంచి అక్కడే పనిచేస్తోంది. ఆమె భర్త పదేళ్ల క్రితమే మృతిచెందాడు. దీంతో ఇద్దరు కూతుళ్లతో కలిసి జీవిస్తోంది. ఇప్పుడు అమృత చనిపోవడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలుగా మారారు. ఏఎన్ఎం మృతిచెందడంపై సర్పంచ్ యాదవరెడ్డి, వైద్యుడు సత్యప్రకాష్, సిబ్బంది జితేందర్‌రెడ్డి, సురేశ్, తోటీ ఏఎన్ఎంలు సంతాపం తెలిపారు. సురేశ్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అమృత సొంతూరైన కోహీర్‌లో అంత్యక్రియలు జరుగుతాయని వైద్యులు తెలిపారు.

చోరీకి గురవుతున్న కేబుల్‌వైర్లు, స్టార్టర్లు



కేబుల్ వైరు, స్టార్టర్ చోరీ జరిగిందని చూపుతున్న రైతు

తూప్రాన్: వ్యవసాయ బోరుబావుల వద్ద నుంచి కేబుల్ సర్వీస్ వైర్లు, స్టార్టర్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్తున్నారని మండలంలోని వట్టూరు, పడాల్‌పల్లి, నాగులపల్లి జెండాపల్లి గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వ్యవసాయ బోరుబావుల నుంచి రూ.వేలల్లో విలువ చేసే స్టార్టర్లు, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లడంతో ఖరీఫ్‌లో సాగుకు కష్టంగా మారిందని వాపోతున్నారు. సుమారు 10 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లు దొంగతనం జరిగినట్లు తెలిపారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేస్తే దొంగతనాలను అరికట్టవచ్చునని పేర్కొంటున్నారు.

పట్టించుకునేవారే లేరా?

- గుంతలమయంగా రహదారి
- రాకపోకలకు ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



బోల్తా పడిన డీసీఎం వాహనం



రోడ్డుపై గుంతలో ఇరుకున్న ఇసుక లారీ

వట్‌పల్లి(అందోల్): రెండేళ్లుగా అభివృద్ధి కాదు కదా కనీసం మరమ్మతులు కూడా చేయడంలేదు ఈ రోడ్డుకి. మరమ్మతుల కోసం టెండర్లు పిలిచినా ఏ కాంట్రాక్టరూ ప్యాచ్ వర్కులు చేసేందుకు ముందుకు రావడం లేదు. బిల్లులు సకాలంలో అందవేమోనన్న అభద్రతాభావం వారి వెనుకడుగుకు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపుగా రెండేళ్ల క్రితం రూ.2.97 కోట్లతో పోతులబోగుడ నుంచి రాయిపల్లి వరకు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఏడుసార్లు టెండర్లు పిలిచినా ఏ ఒక్క కాంట్రాక్టరు ముందుకు రాకపోవడమే ఇందుకు నిదర్శనం. ఈక్రమంలో చిన్న గుంతలు కాస్తా పెద్దవయ్యాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలకు ప్రత్యక్ష నరకంగా మారింది. అల్లాదుర్గం నుంచి వట్‌పల్లి , మెటల్‌కుంట మీదుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. దీనికి తోడు వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతోంది.

వరుస ఘటనలతో బెంబేలు

- ఈ రోడ్డు గుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు జహీరాబాద్, రాయికోడ్ ప్రాంతాలకు నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.
- నిత్యం పరిమితికి మించి ఇసుకను లారీలలో ఈ రోడ్డు గుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రోడ్డు ధ్వంసమై గుంతలు పడేందుకు ఒకింత కారణమైన అధికారులు తమకేమీ పట్టవన్నట్లు వ్యవహరించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- గతనెల 26వ తేదీన మండలంలోని మేడికుందా సమీపంలో గుంతలో ఓ లారీ దిగబడటంతో వాహనదారులు నానా ఇబ్బందులుపడ్డారు.
- అదే రోజు రాత్రి పత్తిని తరలిస్తున్న డీసీఎం వాహనం బోల్తా పడింది. శనివారం మరో లారీ గుంతలో ఇరుక్కుపోయింది. ఇలా నాలుగు రోజులలో మూడు ఘటనలు జరిగినా కనీసం రోడ్డు మరమ్మతులపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.
- ప్రాణాలు పోతేనే స్పందిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

టెండర్లకు రావడం లేదు

రెండేళ్ల క్రితం 10.5 కిలోమీటర్ల దూరం రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2.97 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకు ఏడు సార్లు టెండర్లకు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. దీంతో రోడ్డు మరమ్మతుల నిర్వహణలో జాప్యం జరుగుతోంది. నాలుగు రోజులుగా జరుగుతున్న ఘటనలు మా దృష్టికి వచ్చాయి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గుంతల పూడివేతకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాము, ఆర్‌అండ్‌బీ ఏఈ

ముద్దాపూర్ సర్పంచ్ ఉమ కన్నుమూత

- ముగిసిన అంత్యక్రియలు
- పాడెమోసిన ఎఫ్‌డీసీ చైర్మన్



సర్పంచ్ ఉమ (ఫైల్)



పాడె మోస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ సర్పంచ్ తూం ఉమ(55) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. కుటుంబసభ్యులు సాయంత్రం 4 గంటల సమయంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె భర్త తూం అంజిరెడ్డి మాజీ జడ్పీటీసీ, కుకునూరుపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. 20 ఏళ్లుగా ఆమె కుటుంబం రాజకీయ రంగంలో ఉంది. కాగా ఉమ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రైతు బంధు రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యుడు దేవి రవిందర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, సర్పంచ్‌లు పాల్కంపల్లి జయంతి, మిట్టపల్లి వసంత, కోల శ్రీనివాస్, కందూరి కనకవ్వ, మల్లమారి రవిందర్‌లతోపాటు నాయకులు తదితరులు కుటుంబసభ్యులను ఓదార్చి, పార్థీవదేహం వద్ద నివాళులు అర్పించారు. అయితే ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అంత్యక్రియల్లో పాడె మోశారు. గ్రామంలో వైకుంఠదామం నిర్మించి ఏడేళ్ల గడుస్తుండగా ఉమ అంత్యక్రియలతో ప్రారంభమైంది. అంత్యక్రియ ఊరేగింపులో పీఎస్‌ఆర్ ట్రస్టు నిర్వాహకుడు నరేందర్, నాయకులు కాచం నవీన్‌కుమార్, కోల రవిందర్, తూం మహేందర్, ఉపెందర్, కొంతం రాజు, సంపత్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): ఆర్థిక సమస్యల కారణంగా భర్తతో గొడవపడి భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గౌరారం ఎస్సై సంపత్‌కుమార్ కథనం ప్రకారం వర్గల్‌కు చెందిన షేక్ ఉస్మాన్, హుస్సేన్‌బీ(30)లకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. సాఫీగా సాగుతున్న వీరి వైవాహిక బంధంలో ఇద్దరి మధ్య ఆర్థిక ఇబ్బందులపై గొడవలు జరుగుతుండేవి. శనివారం రాత్రి కూడా మరోసారి ఇదే విషయమై భార్యాభర్తలు గొడవపడ్డారు. తర్వాత వారు భోజనం చేసి నిద్రించారు. అర్ధరాత్రి భర్తకు మెలకువ రాగా భార్య కనిపించలేదు. వెంటనే ఉస్మాన్ తన మామతో కలిసి వెతకగా గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద ఆమె చెట్టుకు ఉరేసు కుని ఆత్మహత్య చేసుకున్నట్లు వారు గుర్తించా రు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుతారిపల్లిలో..

రామాయంపేట(మెదక్): ఆర్థిక సమస్యలతోపాటు అనారోగ్యంతో ఒక కూలీ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుతారిపల్లికి చెందిన రాగి పెద్దవాలోల్ల నర్సింలు (40)కు భార్య భాగ్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నర్సింలు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

ఇద్దరి అదృశ్యం

కుటుంబ సభ్యులు మందలించారని..



నవీన్‌కుమార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లూర్‌లో నివాసం ఉండే నవీన్‌కుమార్ కొంతకాలంగా ఖాళీగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఏదైనా పని చేసుకోవాలని మందలించారు. దీంతో నవీన్‌కుమార్ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి ఎంతకీ రాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. అతడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ ఆడివస్తానని వెళ్లి..



తరుణ్

కొండాపూర్(సంగారెడ్డి): ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని తమ్మళిబాయి తండాలో ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. కొండాపూర్ ఏఎస్సై గౌసొద్దిన్ కథనం ప్రకారం.. తమ్మళిబాయి తండాకు చెందిన తరుణ్ ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాడు. శనివారం సాయంత్రం 5 గంటలకు క్రికెట్ ఆడి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తరుణ్ ఆచూకీ నిమిత్తం బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఫలితం లేకపోయింది. హుటాహుటిన తరుణ్ తండ్రి సూర్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో ఉంది.

హరివిల్లు.. కనువిందు..



సంగారెడ్డి పట్టణంలో కనువిందు చేసిన హరివిల్లు

సంగారెడ్డి పట్టణంలో ఆదివారం సాయంత్రం హరివిల్లు కనువిందు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ దంచి కొట్టి ఒక్కసారిగా వర్షం కురిసింది. వర్షం తగ్గిన అనంతరం రంగు రంగుల ఇంద్రధనస్సు ఇలా దర్శనమిచ్చింది. దీనిని చూసి పట్టణ ప్రజలు మురిసిపోయారు. కొంత మంది ఫోటోలు తీసుకున్నారు. ఇంకొందరు హరివిల్లు కనిపించేలా సెల్ఫీలు దిగారు .

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

మయూరం.. వయ్యారం

చినుకుల సవ్వడికి పురివిప్పి నెమళ్లు వయ్యారాలు ఒలకబోస్తున్నాయి. చల్లటి గాలులకు విహరిస్తూ సందడి చేస్తున్నాయి. తొగుట మండలపరిధిలోని తుక్కాపూర్ శివారులో మయూరాలు తమ వయ్యారాలు పోతూ.. ఎగుతున్న దృశ్యాలు సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట







రెండు ఇళ్లల్లో చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తుతెలియని దుండగులు రెండు ఇళ్లల్లో చోరీ చేసిన సంఘటన భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం ఎల్‌ఐజీ కాలనీలో రమేశ్, సాంబశివరావు పక్కపక్కనే ఉంటారు. రమేశ్ అతడి కుటుంబ సభ్యులతో కలిసి జహీరాబాద్‌లో గ్రూపు 4 పరీక్ష రాసేందుకు వెళ్లారు. సాంబశివరావు అతడి కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరు వెళ్లారు. తిరిగి ఆదివారం ఇద్దరు వారి ఇళ్లకు చేరుకున్నారు. అప్పటికే ఇళ్లకు వేసిన తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా ఇళ్లలో ఉన్న సుమారు 5 తులాల బంగారు ఆభరణలు, కొంత నగదు పోయినట్లు గమనించారు. ఇద్దరి వేర్వేరు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా ఢీకొన్న కారు

నర్సాపూర్: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని కారు ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. నర్సాపూర్‌కు చెందిన నాగమణి మెయిన్‌రోడ్డుపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపాన రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. అదే కారులో డ్రైవర్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయాడని తెలిసింది. అయితే ఆమె తలకు తీవ్ర గాయం, చేతికి కూడా దెబ్బతగిలిందని స్కానింగ్ తీయాల్సి ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ విషయమై ఎస్‌ఐ శివకుమార్‌ను అడగ్గా.. ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు. కారును గుర్తించి డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి రిమాండ్



మాట్లాడుతున్న ఏసీపీ దేవారెడ్డి, పక్కన త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్

సిద్దిపేటకమాన్: యువతిని ప్రేమ పేరిట వంచించి, పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన నిందితుడు కటకటాల పాలయ్యాడు. ఆదివారం ఏసీపీ కార్యాలయంలో త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్‌తో కలిసి ఏసీపీ దేవారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని రంగదాంపల్లి గ్రామానికి చెందిన మల్లం శ్రీనివాస్ ఓ రాజకీయ పార్టీలో సోషల్ మీడియా కో కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం సమీప గ్రామానికి చెందిన ఓ యువతిని శ్రీనివాస్ ఓ సోషల్‌మీడియా ద్వారా పరిచయం చేసుకున్నాడు. రోజు ఫోన్లు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ చేస్తూ ఆమెను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె అతడి ప్రేమలో పడింది. కొద్ది రోజుల క్రితం బాధితురాలు తన అక్క వద్దకు వెళుతుండగా, తను వదిలిపెడతానని కారులో ఎక్కించుకున్న శ్రీనివాస్ ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అలా వేర్వేరు సందర్భాల్లో రెండుమూడు సార్లు కలిసిన శ్రీనివాస్‌ను ఆమె వివాహం చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. దీంతో బాధితురాలు సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. అయితే ఈ ఘటనపై నిందితుడు ఏ పార్టీకి సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్నాడని విలేకరులు అడిగిన ప్రశ్నకు బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్నాడని ఆరోపణలు వచ్చాయని ఏసీపీ తెలిపారు. ఎలాంటి ఐడెంటీ కార్డు గానీ, సమాచారం గానీ లేదన్నారు. సమావేశంలో త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్ ఉన్నారు.

మహిళ అదృశ్యం కేసు విషాదాంతం



సరిత(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): పుట్టింటికి వచ్చిన మహిళ అదృశ్యం కేసు విషాదాంతమైంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి కథనం ప్రకారం మండలంలోని కూచారం గ్రామానికి చెందిన మజ్జతి కృష్ణమూర్తి కూతురు సరిత(40)ను ఇరవై ఏళ్ల క్రితం బీబీనగర్ మండలం చిన్నరావులపల్లికి చెందిన సారాగి సత్యనారాయణతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు 2 ఏళ్ల నిశాంత్, 12 ఏళ్ల తేజ ఉన్నారు. కాగా భర్త సత్యనారాయణ నెల రోజులు క్రితం అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి సరిత మానసికవేదనకు గురైంది. దీంతో సరిత ఆమె పిల్లలను కుటుంబసభ్యులు పుట్టినిల్లయినా కూచారానికి తీసుకొచ్చారు. 2 రోజుల క్రితం సరిత తన చిన్న కుమారుడి నిశాంత్‌తో మాట్లాడి తాను తన నాన్న వద్దకు వెళుతున్న జాగ్రత్తగా ఉండాలని చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు బంధువులను, తెలిసిన వారిని విచారించారు. గ్రామస్తుల అనుమానం ప్రకారం చౌటబావిలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం ఇంటి వద్ద గల సంపులో చూడగా ఆమె విగతజీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతదేహం బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు రవీందర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి...



నజీర్ (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: అనారోగ్యంతోపాటు కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలం ఎన్సాన్‌పల్లిలో ఆదివారం జరిగింది. త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం ఎన్సాన్‌పల్లికి చెందిన నజీర్ (38) ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. ఏడాదిగా పక్షవాతం బారిన పడ్డాడు. ఇంటి వద్దే ఉంటున్నాడు. గ్రామంలో తమ కుటుంబానికి చెందిన 15 గుంటల భూమి తల్లి గౌనియా బేగం పేరిట ఉంది. ఆ భూమిని తన పేరిట చేయాలని నజీర్ తల్లిని కోరగా తిరస్కరించింది. భూమి తన పేరిట చేయడం లేదని, అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులు పెరిగి మనస్తాపానికి గురయ్యాడు. శనివారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. వాకింగ్ చేసే ప్రాంతంలో ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు వెతకగా చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య పర్వీన్, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా నజీర్ పనిచేశాడు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని...



నర్సింహులు మృతదేహం

చేగుంట(తూప్రాన్): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. 44వ నంబర్ జాతీయ రహదారి.. చెట్లతిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద ఈ ఘటన జరిగింది. చేగుంట ఎస్‌ఐ ప్రకాష్‌గౌడ్ కథనం ప్రకారం .. మాసాయిపేటకు చెందిన కొట్టిముల నరసింహులు(41) బైక్‌పై చెట్లతిమ్మాయిపల్లి నుంచి మాసాయిపేట వైపు వస్తుండగా, చేగుంట నుంచి చెట్ల తిమ్మాయిపల్లి వైపునకు మరో బైక్ వెళుతోంది. ఈ రెండు బైక్‌లు చెట్లతిమ్మాయిపల్లి చౌరస్తా వద్దకు వచ్చేసరికి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నర్సింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న కొరివిపల్లి తండాకు చెందిన రవిందర్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు మృతదేహం పోస్ట్‌మార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని మహిళ మృతి



రాజమణి (ఫైల్)

ములుగు(గజ్వేల్): వేగంగా వచ్చిన కారు మహిళను ఢీకొట్టగా అక్కడికక్కడే దుర్మరణం చెందింది. రాజీవ్ రహదారిపై ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ రాంబాబు కథనం ప్రకారం మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఆలేటి రాజమణి(50) తన ఇంటి నుంచి ములుగు క్రాస్‌రోడ్డు వద్దకు బయలుదేరింది. రెడ్డి రెస్టారెంట్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కారు ఆమెను ఢీకొంది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహానికి గజ్వేల్ మార్చురీలో పోస్టుమార్టం జరిగిందని హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్ తోట సంపత్‌పై పోలీసు కేసు నమోదైంది. కాగా ఈ మార్గంలో వెళుతున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మృతురాలి వివరాలు తెలుసుకొని ఆమె కుటుంసభ్యులకు సమాచారం అందించారు.


బైక్‌లను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మునిపల్లి(అందోల్): ఆర్టీసీ బస్సు బైక్‌లను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన లింగంపల్లి శివారు 65వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ కు వస్తోన్న ఆర్టీసీ బస్సు రెండు బైక్‌లను ఢీకొందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై బుదేరా ఎస్‌ఐ రాజశేఖర్ వివరణ కోరగా, బైక్‌లకు సంబంధించిన వారు ఫిర్యాదు చేయలేదన్నారు.

కారు బోల్తా పడి మరో మహిళ..

మునిపల్లి(అందోల్): 65వ నంబర్ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి రోడ్డు దిగువకు దూసువెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో మహిళ మృతిచెందింది. బుదేరా ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం ఆదివారం జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులోకి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు దిగువకు వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురిలో ఓ మహిళ మృతిచెందని ఎస్‌ఐ తెలిపారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతివేగానికి లారీ బోల్తా



పొలంలో బోల్తా పడిన లారీ

తొగుట(దుబ్బాక): ఇసుక లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని రాంపురం శివారులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపునకు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. లారీ అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికలు తెలిపారు.

బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న లారీ



దుర్గయ్య (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎం మృతిచెందిన సంఘటన పట్టణ కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొమురవెల్లి మండలం అయినాపూర్‌కు చెందిన వేముల దుర్గయ్య(53) నాగపురి హైస్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. పట్టణ కేంద్రంలోని బీడీ కాలనీలో నివాసముంటున్నాడు. 3 ఏళ్ల క్రితం భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు హైదరాబాద్‌కు మారడంతో వారాంతం వారి వద్దకు వెళ్లి వస్తుంటాడు. కాగా ఆదివారం పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో బైక్‌పై వెళుతున్న ఆయన్ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ వెనుక టైర్ల ఆయన తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.